క్లుప్తంగా

జయంతిపురం గ్రామస్తుల ఆందోళన



జగ్గయ్యపేట: గ్రామంలోని వేదాద్రి రోడ్డు కాలనీలో వరదనీరు రోడ్లపై నిలవడంతో నానా ఇబ్బందులు పడుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు గంటపాటు రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు వెంటనే బాధితులతో మాట్లాడారు. మూడు అడుగుల మేర నీరు నిలిచిందని నీటిని తొలగించకపోవడంతో అవస్థలు పడుతున్నామని బాధితులు ఆయనకు వివరించారు. దీంతో తహసీల్దార్ వెంటనే ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డును పగలగొట్టి వరద నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులు శాంతించారు.

బాధితులకు ఆహారం



కంచికచర్ల: భారీవర్షాల కారణంగా స్థానిక ఓసీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రంలో ఉంటున్న వరద బాధితులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో బుధవారం భోజనం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య మాట్లాడుతూ 500మంది వరద బాధితుల కోసం భోజనం ఏర్పాటు చేయడంతోపాటు వారికి పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంఘ నాయకులు శేషం గోపాలరావు, నండ్రు సురేష్ బాబు, బళ్లా రవికుమార్, తంగిరాల రాంబాబు, సయ్యద్ మౌలాలి, మందా సుధాకర్, మాడుగుల వాసుబాబు, అమర్లపూడి జేమ్స్, ఇస్మాయేల్, బాణావత్ శ్రీనివాసరావు, జె.శ్రీరామమూర్తి కొమ్ముకూరు దివాకర్, మద్దాల రమేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ



వత్సవాయి: విజయవాడలోని 500 వరద బాధిత కుటుంబాల కోసం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.4లక్షల విలువగల నిత్యావసర సరుకులను వితరణ చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు నేతృత్వంలో బుధవారం ఈ నిత్యావసర సరుకులను ప్రత్యేక వాహనాల్లో విజయవాడ తరలించారు. ఈ వాహనాన్ని ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు, డీటీ రవికుమార్ జెండాఊపి ప్రారంభించారు. సంఘ నాయకులు చిరునోముల రమేష్, గుర్రం వెంకట లక్ష్మీశ్రీధర్, చక్రవర్తి, గుర్రం కృష్ణవేణి, అద్దగిరి కళావతి, యర్రా పద్మ, పుష్పలత, పెరుమాళ్ల శ్యామల, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

కంచికచర్ల: వరదలకు కీసర మున్నేరు ఒడ్డున ఉన్న గండేపల్లి రక్షితమంచినీటి పథకం ప్రధాన పైప్‌లైన్ కొట్టుపోవడంతో బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఆయా పనులను సర్పంచి బొక్కా రవికుమార్, కార్యదర్శి జె.రత్నాకర్ పర్యవేక్షించారు.

బాధితులకు పరామర్శ

కంచికచర్ల : భారీవర్షాలకు నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు కోరారు. గనిఆత్కూరు, కొత్తపేట, చెవిటికల్లు తదితర గ్రామాల్లోని వరద బాధితులను బుధవారం ఆయన పరామర్శించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. జెడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, మాజీ ఎంపీపీ పాడిబండ్ల హరిజగన్నాధరావు, కొత్తపేట సర్పంచి ప్రత్తిపాటి సునీత, మాజీ సర్పంచి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రత్తిపాటి కృష్ణమూర్తి, ముప్పాళ్ల సత్యనారాయణ, మార్త శ్రీనివాసరావు, వేల్పుల రమేష్ ఉన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: కంచల గ్రామంలోని వరద ముంపు బాధితులను మాజీఎమ్మెల్యే జగన్ మోహనరావు పరామర్శించారు. దెబ్బతిన్న పంటలు, రోడ్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య, పార్టీ మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్, చలమల మధుసూధనరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

జగ్గయ్యపేట: మండలంలోని బూదవాడ, అన్నవరం, రెడ్డినాయక్‌తండ, బలుసుపాడు గ్రామాలలో నష్టపోయిన పంటలను సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. అనంతరం రెడ్డినాయక్‌తండా గ్రామంలో రోడ్ల పరిశీలనకు వచ్చిన ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజును కలిసి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు రవికుమార్, గౌస్‌మియా, నరేంద్ర, కోట కృష్ణ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

జగ్గయ్యపేట అర్బన్: వరద బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని సీపీఐ నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు అంబోజి శివాజీ, జె.శ్రీనివాసరావు, పోతిపాక వెంకటేశ్వర్లు, మెటికల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



భారీవర్షాలకు బూదవాడలో కూలిన ఇల్లు



వెల్లంకి సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



నేలకూలిన ముచ్చింతాల యూపీ పాఠశాల ప్రహరీ



పల్లంపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా-కట్టలేరు

ఎంత కష్టం..ఎంత నష్టం

భారీ వర్షాలు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల ప్రజలకు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. వందలాది మంది ఇంకా పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. మునేరు, పాలేరు, వాగులు, వంకలు పొంగి ప్రవహించి గ్రామాలను వరదతో ముంచెత్తాయి. ఇళ్లు, దుకాణాల్లోకి చేరిన వరదనీటి తొలగింపునకు జనం అవస్థలుపడుతున్నారు. ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, దుస్తులు పాడైపోయాయని బాధితులు వ్యక్తంచేస్తున్న ఆవేదన వర్ణనాతీతం. చెరువులు, కాలువలకు గండ్లు పడటంతో వరద ఉధృతికి వేలాది ఎకరాల్లోని వరి, పత్తి, మొక్కజొన్న, మినుము, పసుపు, కంది పంటలతోపాటు అరటితోటలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. నాలుగురోజులుగా ఆయా పంటలు నీళ్లలోనే నానుతుండటంతో రైతులకు వందలాది కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఇప్పటికీ కొన్ని గ్రామాల పరిధిలోని వరి పొలాలు వరద ఉధృతి ధాటికి చెరువులను తలపిస్తుండటంతో రైతన్నలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వందలాది విద్యుత్ స్తంభాలు నేలకూలగా, పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. దీంతో శివాపురం, అనిగండ్లపాడు తదితర గ్రామాలు నాలుగురోజులుగా అంధకారంలోనే మగ్గుతుండటం వరద సృష్టించిన బీభత్సానికి అద్దంపడుతోంది.

– పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, కంచికచర్ల, వత్సవాయి, వీరులపాడు



వత్సవాయి మండలం రేగులగడ్డ వద్ద నదిని తలపిస్తున్న వరి పొలాలు



పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రులో దెబ్బతిన్న వరి పంట



నాలుగు రోజులుగా వరదనీటిలో ఉన్న కంచికచర్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ



బూదవాడలో ఇంటిలో పేరుకుపోయిన వరద బురదను శుభ్రం చేస్తున్న మహిళ



వత్సవాయి: ధ్వంసమైన వేమవరం నుంచి పెనుగంచిప్రోలు వెళ్లే రహదారి



ముచ్చింతాల పాఠశాల తరగతిలో పేరుకుపోయిన ఒండ్రుమట్టి



దెబ్బతిన్న సామగ్రిని సరిచేసుకుంటున్న వ్యాపారులు



జగ్గయ్యపేట హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



గనిఆత్కూరులో బాధితుడిని పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

మాజీ ఎమ్మెల్యేపై టీడీపీ మూకల దౌర్జన్యం

కంచికచర్ల : స్థానిక ఓసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం పరిశీలనకు వెళ్లిన నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే కంచికచర్ల ఓసీ కల్యాణ మండపంలో వరద బాధితు కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు బుధవారం సందర్శించారు. కొత్తపేటకు చెందిన వరద బాధితులను పరామర్శించారు. బాధితులకు అందిస్తున్న సౌకర్యాలపై అక్కడే ఉన్న ఆర్డీఓ రవీంద్రరావు, తహసీల్దార్ జాహ్నవిని వాకబు చేశారు. వరద బాదితులకు అందుతున్న సౌకర్యాల గురించి వాకబు చేశారు. పునరావాసకేంద్రం ప్రభుత్వ నిధులతో నడుస్తోందా? లేక ప్రైవేట్ యాజమాన్యంతో నడుస్తుందా అని అధికారులను అడిగితెలుసుకుంటున్న సమయంలో అక్కడే ఉన్న టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోగంటి వెంకటసత్యనారాయణతోపాటు పలువురు టీడీపీ నాయకులు మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావును చూసి 'మీకేం పని మీరెందుకు వచ్చారంటూ' కేకలు వేశారు. గోబ్యాక్ మాజీ ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేశారు. గొడవ ఎందుకు చేస్తున్నారంటూ టీడీపీ నాయకులను ఆర్డీఓ రవీంద్రరావు, తహసీల్దార్ జాహ్నవి ప్రశ్నించినప్పటికీ వారి మాటలను పెడచెవిన పెట్టారు. డాక్టర్ జగన్‌మోహనరావు పునరావాస కేంద్రం నుంచి బయటకు వచ్చి కారు ఎక్కుతుండగా, ఆయన వాహనాన్ని చుట్టుముట్టారు. ఆ సమయంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, నాయకులు మార్త శ్రీనివాసరావు, వేల్పుల రమేష్ సర్దిజెప్పడంతో టీడీపీ నాయకులు తమ గందరగోళాన్ని ఆపారు. మాజీఎమ్మెల్యేపై టీడీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతుండటాన్ని గమనించిన వరద బాధితులు సైతం ఈ సంఘటనను చూసి విస్మయం చెందారు. టీడీపీ నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా వరద బాధితులను ఆదుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపునిస్తుంటే... టీడీపీ నాయకులు మాత్రం పరామర్శకు వచ్చిన మాజీఎమ్మెల్యేపై దౌర్జన్యానికి పాల్పడటమేమిటని బాధితులు గుసగుసలాడుకున్నారు.

టీడీపీవి దిగజారుడు రాజకీయాలు..

నందిగామటౌన్: వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకున్నా తామెప్పుడూ ప్రజల పక్షమేనన్నారు. గతంలో తాము బాధితులను ఆదుకున్న తీరే అందుకు నిదర్శనమన్నారు. ప్రజలకు మంచి జరుగుతుంటే అడ్డుకునేంత సంస్కార హీనులం కాదన్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా వరద బాధితులను పరామర్శించేందుకు వెళితే వారి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ నాయకులు తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచికచర్ల ఓసీ కల్యాణ మండపంలోని పునరావాస కేంద్రంలో ఆర్డీవోతో మాట్లాడుతుండగా టీడీపీ నేతల తీరు దిగజారుడు రాజకీయాలకు నిదర్శమన్నారు. ఇకపైనా ప్రభుత్వం స్పందించి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు.



మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావుపై దౌర్జన్యానికి పాల్పడుతున్న టీడీపీ నాయకులు

■ **ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా**

పెనుగంచిప్రోలు: వరద కారణంగా పైపులైన్లు కొట్టుకుపోవడంతో పెనుగంచిప్రోలు గ్రామస్తులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి గ్రామంలోని ప్రతి వీధికి ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేపట్టారు.

వరద బాధితులను ఆదుకోవాలి : ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: వరద విపత్తుకు నష్టపోయిన ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కోరారు.

జగ్గయ్యపేటలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పాలేటి తీరాన ఉన్న విలియంపేట, పద్మావతినగర్, మఠం శివాలయం ప్రాంతం, మిట్టగూడెం, యానాదుల కాలనీ, ఆరోవార్డుల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. ముక్త్యాల రోడ్‌లో స్మశానవాటిక ప్రహరీ, కొట్టుకుపోయిన సమాధుల ప్రాంతాన్ని పరిశీలించారు. జగ్గయ్యపేట-అగ్రహారం పాలేటి బ్రిడ్జి, పేట పట్టణానికి తాగునీటిని అందించే హెడ్‌వాటర్ వర్క్స్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ వరద ఉధృతికి హెడ్‌వాటర్ వర్క్స్ దెబ్బతిని ఐదు రోజులుగా పట్టణానికి నీటిసరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. రూ.2.50 కోట్లతో హెడ్‌వాటర్ వర్క్స్‌ను పునరుద్ధరించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ విపత్తు కారణంగా జగ్గయ్యపేట నియోజకవర్గానికి సుమారు రూ.1000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. పేట మండలంలోని అగ్రహారం బ్రిడ్జి, వత్సవాయి మండలంలోని లింగాల బ్రిడ్జిని పునర్నిర్మాణం చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి చిన్నా, తుమ్మల ప్రభాకర్, నాయకులు ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, సాధుపాటి రాజు, జాన్‌బాషా, చావా పిచ్చయ్య, బాలస్వామి ఉన్నారు.



విలియంపేటలో బాధితులను పరామర్శిస్తున్న సామినేని ఉదయభాను

ఊరచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్

జగ్గయ్యపేట అర్బన్: వరద ముంపు ప్రాంతాల పరిశీలనలో భాగంగా పట్టణంలో ఊరచెరువును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం పరిశీలించారు. చెరువుకు ప్రధాన చానెల్స్ అయిన ఎర్రకాలువ, వేపలవాగు పొంగి గృహాలలోకి నీరు వచ్చిన నేపథ్యంలో చెరువు నిండిపోయి ఉండటంతో ఇటీవల చెరువుకు గండిపెట్టి నీరంతా బయటకు పోయేలా చేశారు. దీంతో ఎమ్మెల్యే చెరువును పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

చవితిపందిళ్లకు అనుమతులు తప్పనిసరి : ఏసీపీ

కంచికచర్ల : డివిజన్ పరిధిలో వినాయకచవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసే పందిళ్లకు తప్పకుండా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని నందిగామ డిఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. ఆయన బుధవారం కంచికచర్ల పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పందిళ్ల వద్ద డీజేలు, లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు అనుమతిలేదన్నారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో జరుగకుండా కమిటీల సభ్యులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను తెలియజేస్తే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. రూరల్ సర్కిల్ సీఐ డీ చవాన్, ఎస్ఐ బోనగిరి రాజు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన నర్సింగ్ విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన బీఎస్సీ నర్సింగ్ ఫస్టియర్ సెమిస్టర్‌ఫలితాల్లో స్థానిక వాగ్దేవినర్సింగ్ కళాశాల విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ బి.సరిత తెలిపారు. బి.శ్రీవాణి కె.ప్రియదర్శిని, జెట్టి మానస కళాశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులతో యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభను కనబరిచారని వివరించారు. ప్రతిభచూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

లైన్‌మెన్‌కు పలువురి నివాళి

వత్సవాయి: విధి నిర్వహణలో జూపూడి వద్ద మృతిచెందిన వత్సవాయి గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ వజ్రాల కోటేశ్వరరావు మృతదేహాన్ని బుధవారం పలువురు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ధనమూరి వెంకట లక్ష్మీనరసింహాచారి, చల్లాల శివాజీ, పి సాంబశివరావు, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల అధ్యక్షులు నంచర్ల గోపాలరావు, కె శ్రీనివాసరావు ఉన్నారు.